క్లుప్తంగా

పార్టీ పదవులు బాధ్యతగా నిర్వహించాలి



ముదునూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

నరసాపురం: పార్టీ అప్పగించిన పదవులను బాధ్యతగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడిగా నియమితులైన నడపన చిన్ని గురువారం రాత్రి ముదునూరిని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా పూర్తి బలోపేతం చేసే చర్యల్లో భాగంగా మండల కమిటీలను నియమించామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మండలె కృష్ణ, చిట్టూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి కిట్స్‌తో విద్యార్థులు, చిత్రంలో జెడ్పీటీసీ సభ్యురాలు గౌరీ సుభాషిణి

పెనుమంట్ర: పాఠశాల విద్యలో విద్యార్థులు సెల్‌ఫోన్లు వదిలి పెట్టి, చదువుపై ధ్యాస ఉంచాలని పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు గౌరీ సుభాషిణి కోరారు. మండలంలోని మార్టేరు బసంతీ దేవి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం ఉదయం డాక్టర్ సర్వేపల్లి విద్యా సామగ్రి కిట్లను పంపిణీ చేశారు. పిల్లలు మంచి మంచి గోల్స్ పెట్టుకొని అందుకు తగ్గట్టుగా చదువులో ముందుకు సాగాలని మార్టేరు గ్రామ ఉప సర్పంచ్ కర్రి వేణుబాబు కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీ గణేష్, మట్టా రాము తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



పెనుగొండ సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు వినీత

పెనుగొండ: మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులను పరామర్శించారు. వార్డులను తనిఖీ చేసి, ల్యాబ్, ఎక్స్‌రే ఆపరేషన్ థియేటర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.కృష్ణకుమారి, సూపర్‌వైజర్ జి.సుజాత, డాక్టర్ విజయలక్ష్మీ, ఎస్.కుమారి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌కు రూ.7 లక్షల విరాళం



రోటరీ క్లబ్ ప్రెసిడెంట్‌కు చెక్కును అందిస్తున్న మద్దాల వాసు

పాలకొల్లు సెంట్రల్: రోటరీ పాస్ట్ ప్రెసిడెంట్ మద్దాల వాసుకు టీబీఆర్ ఐకాన్ అవార్డు రావడంపై రోటరీ క్లబ్ సభ్యులు అభినందనలు తెలియజేశారు. గురువారం జరిగిన రోటరీ క్లబ్ సమావేశంలో వాసును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఎంతో మందికి సహాయ సహకారాలు అందిస్తున్న రోటరీ క్లబ్ రూ. 7,16,724ల చెక్కును క్లబ్ అధ్యక్షులు రావాడ సతీష్‌కు అందజేశారు. కార్యక్రమంలో మద్దాల రాంప్రసాద్, జవ్వాజి కళ్యాణ్, పోతాబత్తుల సత్యనారాయణ, ముత్యాల శ్రీనివాస్, ఇమ్మిడి రాజేష్, మైగాపుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం రావాలి



అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న రత్నకుమారి

ఆకివీడు: మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటున్నారని, అదే విధంగా మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ రత్నకుమారి పిలుపునిచ్చారు. స్థానిక సీడీపీఓ కార్యాలయంలో మహిళల్లోచైతన్యం, అక్రమ రవాణా నిరోధంపై గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు, పిల్లలకు మోసపూరిత మాటలు చెప్పి అక్రమంగా తరలిస్తున్న ముఠాలపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ ముసుగులో మహిళలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ప్రమాదాలకు గురైన సందర్భంలో 1098,100, 181,1930లకు ఫోన్‌చేసి రక్షణ పొందాలని సూచించారు.

రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?

మండలంలో ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారి, పుంతరోడ్లుగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా పెనుగొండ, నత్తారాశ్వరం రోడ్డులో కత్తవపాడు నుంచి జుత్తిగ వరకు అదేవిధంగా పాలమూరు- పాదలాడ రోడ్డులో పాలమూరు నుంచి బ్రాహ్మణ చెరువు వరకు, నత్తారామేశ్వరం-కవిటం రోడ్డులో నెలమూరు- ముడుగుపోలవరం మధ్యలో రోడ్లు బురదమయంగా మారి, అధ్వానంగా తయారయ్యాయి. నౌడూరు సెంటర్‌నుంచి పాలమూరు వైపుకు మిగిలిన 60 మీటర్ల రోడ్డును గత శుక్రవారం సాయంత్రం ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మత్తులు చేసినా ఒక్క రాత్రిలోనే ఆ రోడ్డంతా ధ్వంసమైంది. సమీప మండలాలకు ట్రాక్టర్లు, టిప్పర్లపై యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వదిలేయడంతో రోడ్లన్నీ మట్టితో నిండి కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి.

– పెనుమంట్ర



నెలమూరు-ముడుగుపోలవరం ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి



నౌడూరు- పాలమూరు మధ్య వేసిన రోడ్డు ఇలా..



మట్టి ట్రాక్టర్లు విధ్వంసానికి గురైన జుత్తిగ- కత్తవపాడు ఆర్అండ్‌బీ రోడ్డు



మట్టిరవాణాతో అధ్వానంగా మారిన మల్లిపూడి-అర్జునుడిపాలెం సీసీ రోడ్డు



అరకొర మరమ్మతులు చేసి వదిలేసిన పాలమూరు- పాదలాడ ఆర్అండ్‌బీ రోడ్డు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



శిద్దానిని అభినందిస్తున్న గుడాల గోపి



హనుమంతును అభినందిస్తున్న ఇన్‌చార్జ్ గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో నూతనంగా పార్టీ పదవులు పొందిన నాయకులను అభినందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వీవర్స్ వింగ్ ఉపాధ్యక్షుడిగా శిద్దాని మల్లికార్జునరావు, పట్టణ ఉపాధ్యక్షుడిగా కొరగింజల హనుమంతులను సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాస్, బండి రమేష్, కొరగింజల శ్రీనువాసు, జోగి వెంకటేశ్వర్లు, కెల్లా శ్రీను, ఉండ్రాజవరపు రవి తదితరులు పాల్గొన్నారు.

పెనుమర్రులో పూర్తయిన రీ–సర్వే

యలమంచిలి: ఆంధ్రప్రదేశ్ సర్వే, సరిహద్దుల చట్టం , 1923లోని సెక్షన్ 13 ప్రకారం పెనుమర్రు గ్రామంలో వ్యవసాయ భూముల రీసర్వే పూర్తి అయిందని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ తెలిపారు. రీ సర్వే పూర్తయిన సందర్భంగా రైతులకు భూమి వివరాలు వివరించడానికి స్థానిక గ్రామ సచివాలయం వద్ద గురువారం గ్రామ సభ ఏర్పాటుచేశారు. గ్రామసభలో తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి ద్వారా ప్రచురించిన రీసర్వే ప్రకారం గ్రామ విస్తీర్ణం 783.05 ఎకరాలకుగాను సుమారు అర ఎకరం విస్తీర్ణం తగ్గి 782.526 ఎకరాలు వచ్చిందని చెప్పారు. గ్రామంలో మొత్తం 1283 ఎల్‌పీఎంలు వచ్చాయన్నారు. వీటిలో 42 జాయింట్ ఎల్‌పీఎంలు వచ్చాయన్నారు. 42 జాయింట్ ఎల్‌పీఎంలకు సంబంధించిన రైతులు వారికి సంబంధించిన సరిహద్దులు నిర్ధారించుకుని సింగిల్ ఎల్‌పీఎంలుగా మార్చుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కవురు నాగలక్ష్మీ, వీఆర్వో కొడవటి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్

గొర్రెలకు ఉచిత నీలి నాలుక నివారణ టీకాలు

నరసాపురం రూరల్: గొర్రెలకు ఉచిత నీలి నాలుక టీకాల (బ్లూటంగ్) కార్యక్రమాన్ని గొర్రెల రైతులు సద్వినియోగం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీ కృష్ణ అన్నారు. మండలంలోని చిట్టవరం గ్రామంలో గురువారం గొర్రెలకు, నీలి నాలుక వ్యాధి నివారణకు టీకా కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. గ్రామంలో 800 గొర్రెలకు, నీలి నాలుక వ్యాధి టీకాలు వేసినట్లు సురేంద్ర తెలిపారు. మండలంలో సుమారు 9000 గొర్రెలు ఉన్నాయని అన్నారు. అలాగే టీకాల ఆవశ్యకతను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గొర్రెల కాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసాపురం పశు వైద్య అధికారి సురేంద్ర కుమార్, వెటర్నరీ సహాయకులు పాల్గొన్నారు.



చిట్టవరంలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీ కృష్ణ

యోగా సాధనతో రుగ్మతలు దూరం

భీమవరం: ప్రతినిత్యం యోగా సాధన చేయడం వల్ల అనేక శారీరిక, మానసిక రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని పలువురు వక్తలు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అర్ట్‌ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం యోగా శిక్షణ నిర్వహించారు. యోగా గురువు కలిగొట్ల గోపాలశర్మ యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ ఎన్ అనురాధ పాల్గొన్నారు.

కొంతేరు దేవాలయ భూముల కౌలు వేలం

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామంలో ఉన్న శ్రీ కుంతీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానానికి చెందిన భూములను కౌలుకు సాగు చేసుకునేందుకు గురువారం భీమవరం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు వేలం నిర్వహించారు. దేవస్థానం భూములు తొమ్మిది ప్రతులుగా సుమారు 26 ఎకరాలు ఉండగా 3 సంవత్సరాల కాలపరిమితికి వేలం నిర్వహించారు. ఈ భూమిలో 2.28 ఎకరాలకు సంబంధించి ఒక రైతు కౌలు బకాయి ఉండడంతో ఆ భూమికి వేలం వేయలేదు. మిగిలిన భూములకు ఏడాదికి రూ.4,56,500 ఆదాయం వచ్చింది. తనిఖీదారు వర్దినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన వేలంలో కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్‌లు నల్లం రామకృష్ణ, బి భద్రరావు, కోళ్ల వాసు తదితరులు పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు

వైభవంగా ఆరాధన మహోత్సవం

పెనుగొండ: పెనుగొండ వాసవీ శాంతి ధామ్ క్షేత్ర ప్రథమ పీఠాధిపతులు కృష్ణానంద పురి స్వామీజీ ప్రథమ ఆరాధన మహోత్సవాన్ని పలువురు పీఠాధిపతులు ఘనంగా నిర్వహించారు. గురువారం అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ శాంతి ధాంలో క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ బాల స్వామిజీ పర్యవేక్షణలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కృష్ణానంద పురి స్వామీజీ పాదుకులకు పంచామృతాభిషేకం చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 15 మంది పీఠాధిపతులు, మఠాధిపతులు, మాతాజీలు హాజరై కృష్ణానంద పురి స్వామీజీ సేవలను, ఆధ్యాత్మిక చింతనను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శిష్టా మణికంఠ, కోట్ల వెంకటేశ్వరరావు, నార్కెడమిల్లి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణానంద పురి స్వామీజీ విగ్రహానికి అర్చన నిర్వహిస్తున్న పీఠాధిపతులు

మావుళ్లమ్మ జాతర ప్రారంభం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభించారు. బుధవారం రాత్రి అమ్మవారిని నిలబెట్టి గ్రామ దర్శనం చేసి, ఉదయం ఉత్సవాలు ప్రారంభించారు. గ్రామంలోని గరగాలమ్మ, సోమాలమ్మ, పోతురాజులకు చలివిడి పానకాలు సమర్పించారు. ఈ నెల 29వరకూ ఉత్సవాలు కొనసాగుతాయని మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. 24న రాత్రి మావుళ్లమ్మ అమ్మవారికి నవగ్రహ వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర నిర్వహిస్తామన్నారు. 25,26,27 తేదీలో తీర్థ మహోత్సవాలు, 29న భారీ అన్న సమారాధన నిర్వహిస్తామని స్పష్టం చేశారు.



సిద్ధాంతంతో మావుళ్లమ్మ జాతరమహోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

పాఠశాలను విలీనం చేయవద్దని వినతి

పెనుమంట్ర: స్థానిక దళితవాడలో 50 ఏళ్లుగా ఉంటున్న ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాలను వేరే పాఠశాలలో విలీనం చేసి మా పిల్లలను చదువులకు దూరం చేయొద్దంటూ గురువారం పలువురు దళితులు మండల విద్యాశాఖ అధికారికి గ్రామ సర్పంచ్ తాడిపత్రి ప్రియాంక ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. తమ దళితవాడలో 50 ఏళ్లకు పైగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల నిర్వహిస్తున్నారని ఏడాది క్రితం ఈ పాఠశాలను నాడు–నేడు పథకంలో సుందరంగా తీర్చిదిద్దారన్నారు. గతేడాది ఇద్దరు ఉపాధ్యాయులతో 35 మంది విద్యార్థులతో పాఠశాల నిర్వహణ కొనసాగిందని, అయితే ఈ ఏడాది తమ పాఠశాలలోని 3 నుంచి 5 తరగతులను తమ పేటకు అర కిలోమీటర్ దూరంలో ఉన్న వేరో పాఠశాలలో విలీనం చేశారని, దీంతో పేటకు చెందిన 27 మంది విద్యార్థులు వేరొక పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆ పాఠశాలకు వెళ్లడానికి కూడా పిల్లలు నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి పాఠశాల విలీనాన్ని రద్దు చేయాలని కోరారు.



మండల విద్యాశాఖ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న పెనుమంట్ర దళితులు

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి



సీడీపీఓ కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

ఆకివీడు: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు మార్తమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఏ సంక్షేమ పథకం అమలు చేయడంలేదని, తల్లికి వందనం కూడా తమకు అమలుజేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పింఛన్ల సదుపాయం కూడా తమకు కల్పించడంలేదని వాపోయారు. ప్రభుత్వ ఉద్యోగ పేరుతో పథకాలు నిలుపుదల చేశారని, కుటుంబంలోని ఎవరికీ పథకం వర్తింపజేయలేదని ఆరోపించారు. రూ.12 వేలు లోపు జీతం ఉన్న వారికి పథకాలు ఇవ్వాలని జీఓ విడుదల చేసినా ఒక్క పథకం అందజేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వర్కర్లకు, హెల్పర్లకు ప్రభుత్వ పథకాలు అమలుజేసే విధంగా జీఓ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సూపర్‌వైజర్ రత్నకుమారికి వినతి పత్రం అందజేశారు.

సార్వా సాగుకు సన్నద్ధం

- పనుల్లో నిమగ్నమైన రైతన్నలు
- ఉత్సాహంగా నారుమడులు

పెనుగొండ: తొలకరి చినుకులు ప్రారంభం కావడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. సాగుకు అనుకూలమైన మృగశిర కార్తె తొలి రోజు నుంచి రైతులు సార్వా సాగుకు అనువైన వరి వంగడాలను సిద్ధం చేసుకున్నారు. ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ మండలంలో 11782 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 12103 ఎకరాల్లోనూ ఆచంట మండలంలో 10600 ఎకరాల్లో , పోడూరుమండలంలో 12800 ఎకరాల్లో వరి సాగు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు. కాలువలకు నీరు రావడంతో పంట కాలువల్లోకి నీరు చేరడం ప్రారంభించింది. దీంతో కాలువ మొగలో ఉన్న రైతులు చేలల్లోకి నీటిని వదులుకుని నారుమడులు వేయడానికి దమ్ములు చేయడం ప్రారంభించారు.

ఎంటీయూ 1318పై ఆసక్తి

సార్వా సాగుకు అనువైన వరి వంగడాలైన ఎంటీయూ 1318, ఎంటీయూ 2072(స్వర్ణ) రకాలను సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. దీనిలో ఎంటీయూ 1318 రకం వంగడాన్ని ఎక్కువ మంది సాగు చేయనున్నారు. ముందుగా పెనుగొండ మండలంలోని కాలువ పరివాహక ప్రాంతాల్లో సాగు పనులు నాలుగు రోజులుగా జోరుగా సాగుతున్నాయి.పెనుగొండ, వెంకట్రామపురం, వడలి, సిద్ధాంతం గ్రామాల్లో పనులుజోరుగా ప్రారంభమయ్యాయి. వ్యవసాయాధికారులు సూచనలు చేస్తున్నారు. భారీ వర్షాలు పడకుండా ఉంటే నారుమడులకు ఎలాంటి నష్టం ఉండదని, విత్తనాలు జల్లిన అనంతరం ఏమాత్రం వర్షం పడినా మరోసారి విత్తనాలు జల్లుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఎలాంటి ఆటంకం లేకుండా సాగు పనులు ముందుకు సాగాలని రైతులు కోరుకొంటున్నారు.

రూ.60 కోట్లకు పైగా బకాయిలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగుకు ముందే పెట్టుబడి సాయం రూ.7500 ఇచ్చే వారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా ఇప్పటివరకు రైతులకు పట్టించుకోవడం వాపోతున్నారు. దాళ్వా సీజన్‌లో ధాన్యం డబ్బులు ఇంకా రైతుల ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆచంట నియోజకవర్గంలో రూ.60 కోట్లకు పైగా రైతులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉందని వారు తెలిపారు. మే మొదటి వారం నుంచి రైతులకు చెల్లింపులు నిలిచిపోవడంతో సార్వా సాగుకు పెట్టుబడులు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు అప్పులు చేసి సాగు చేయడం జరిగిందని, వాటికి వడ్డీలు చెల్లించలేక నానావస్థలు పడుతున్నామన్నారు. ఈ తరుణంలో సార్వా సాగు కష్ట సాధ్యంగా మారిందన్నారు. సత్వరం చెల్లింపు చేసి సాగుకు పెట్టుబడులు అందించాలని కోరారు.



నారుమడిని సిద్ధం చేస్తున్న దృశ్యం



పెనుగొండ మండలంలో సాగుకు దమ్ము చేస్తున్న రైతు

ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలి

భీమవరం: ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు సకాలంలో జూన్ నెల వేతనాలు అందేటట్లు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి ప్రకాశం, బివి నారాయణ గురువారం ఒకప్రకటనలో కోరారు. పొజిషన్ ఐడి, సిఎఫ్ఎంఎస్ అనుసంధానం సమస్య లేకుండా ట్రెజరీ అధికారులకు విద్యాశాఖ సమగ్ర నివేదికను పంపాలని కోరారు. కొత్తగా ఏర్పడ్డ పిఎస్ హెచ్ఎం పోస్టులు, రీ అపోస్మెంట్ ఖాళీల లో చేరిన ఉపాధ్యాయులకు జూన్ నెల వేతనం సకాలంలో అందేవిధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నాన్ డ్రాయిల్ సర్టిఫికెట్‌తో కొత్త పాఠశాలల్లోనే పూర్తి వేతనం చెల్లించేవిధంగ్గా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఎక్సైజ్ దాడులు

వీరవాసరం: భీమవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం నిర్వహించిన దాడులలో వీరవాసరం గ్రామంలో సీహెచ్. వెంకట్రావు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 07 మద్యం బాటిళ్లను స్వాధానం చేసుకున్నారు. ఈ దాడులలో ఎస్ఐలు పి.ఉమా మహేశ్వర రావు, పి. సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని భీమవరం ప్రొహిబిషన్ , ఎక్సైజ్ ఇనెస్పెక్టర్ కె.బలరామరాజు తెలియజేశారు.

ఆహార పదార్థాల పంపిణీ

పెనుగొండ: అక్షయ పాత్ర ఆధ్వర్యంలో గురువారం వడలి ఎన్టీఆర్ కూడలి వద్ద ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. పెనుగొండలో ఓ కార్యక్రమంలో మిగిలిన ఆహార పదార్థాలను వడలి అక్షయ పాత్ర సభ్యులకు అందించడంతో వాటిని పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అక్షయ పాత్ర సభ్యులు ఉప్పలపాటి చంటి, మేకా సురేష్, అంగర వర ప్రసాద్ పాల్గొన్నారు.

అధికార పక్షాన్ని ప్రశ్నించే బాధ్యత ప్రతిపక్షానిదే...!

తాడేపల్లిగూడెం రూరల్: అధికార పక్షాన్ని ప్రశ్నించే బాధ్యత ప్రతిపక్షంపై ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా కోఆర్డినేటర్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కడియద్ద గ్రామానికి చెందిన పరిమి భూపయ్య వ్యవసాయ క్షేత్రంలో జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ అధికార పక్షాన్ని మేల్కొలిపే బాధ్యత ప్రతిపక్షంపై ఉందన్నారు. మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ హయంలో నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. పంచాయతీ భవనం లేని గ్రామాలు ఉన్నాయని, సచివాలయాలు లేని గ్రామాలు లేవన్నారు. తాడేపల్లిగూడెంకు ఆర్టీఓ, డీఎస్పీ కార్యాలయాలను తీసుకొచ్చారన్నారు. అటువంటి వ్యక్తిని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. సూపర్‌సిక్స్‌లో ఏ ఒక్క హామీని చంద్రబాబు అమలు చేయలేదన్నారు. గత ఏడాది అధిక వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని నేటికీ అందించలేదని మండిపడ్డారు.

విద్యార్థులను మోసం చేసిన కూటమి సర్కార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యార్థులను మోసం చేసిందని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి విమర్శించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడలిలో గురువారం ఏఐఎస్ఏ కార్యకర్తల సమావేశం పి.రాజేష్ అధ్యక్షతన జరిగింది. అప్పలస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ షరతులు విధించి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 29 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు ఎగనామం పెట్టారన్నారు. అనంతరం కళాశాల నూతన కమిటీని నియమించారు. కమిటీ అధ్యక్షుడిగా ఆర్.సాయి, కార్యదర్శిగా పి.పూర్ణ ఎంపికయ్యారు.